
క్లుప్తంగా

మంత్రితో అవార్డు అందుకున్న సర్పంచ్





ఉండవెల్లి: హైదరాబాద్‌లో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ అవార్డులో భాగంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉండవెల్లి గ్రామ పంచాయతీ ఎంపిక కావడంతో గురువారం రాష్ట్ర మంత్రి ఎర్రబల్లి దయాకర్‌రావుతో సర్పంచ్ రేఖ, పంచాయతీ కార్యదర్శి అశోక్‌లు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఉమాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహుకరణ



ధరూరు: మండలంలోని అల్వలపాడు ఎంపీహెచ్‌ఎస్‌కు దాత ఎల్‌ఈడీ టీవీ బహూకరించారు. గురువారం పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ తిమ్మారెడ్డి 32 ఇంచుల టీవీని పాఠశాల హెచ్‌ఎం సరిత, ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

భజన వాయిద్య పరికరాల వితరణ



అయిజ: పట్టణంలోని తిక్క వీరేశ్వరస్వామి ఆలయానికి బీఆర్‌ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి రూ.లక్ష విలువ చేసే భజన వాయిద్య పరికరాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయంలో కమిటీ సభ్యులతో గురువారం విష్ణువర్ధన్‌రెడ్డి సమావేశమయ్యారు. తబల, మద్దెల, హార్మోనియం బాక్స్, మైక్ సెట్, లౌడ్ స్పీకర్లు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు, జోగుళాంబ ఆలయ కమిటీ సభ్యుడు ధనుంజయ్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం




మానవపాడు: మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన గర్భిణి శిరీషను కాన్పు కోసం గురువారం మానవపాడు ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా కలుకుంట్ల సమీపంలో బాబుకు జన్మనిచ్చింది. సాధారణ ప్రసవం అయినట్లు ఎమర్జెన్సీ టెక్నీషియన్ నవీన్ తెలిపారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రం నుంచి చాగాపురం వెళ్లే దారిలో చిన్నవాగు దగ్గర కల్వర్టు నిర్మాణం పనులు జరుగుతుందని తెలిసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైల్వే స్టేషన్ సమీపంలోని వాగుపై కల్వర్టు నిర్మాణం కోసం రోడ్డు మొత్తం తవ్వడంతో ప్రయాణికులకు తాత్కాలిక రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు దగ్గరికి వెళ్తే కానీ పనులు కొనసాగుతున్నట్లు తెలియడం లేదని, చాగాపురం-ఇటిక్యాల వెళ్లే ప్రయాణికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి ప్రయాణికులకు కనపడేలా పనులు జరుగుతున్నట్లు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలి



గద్వాల అర్బన్: ఈనెల 18నుంచి 22వ తేదీ వరకు జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాల్సిన నైతిక బాధ్యత బీజేపీదేనని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు అశోక్, జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్ రోడ్డులో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పరశురాం, మోష, రంజిత్, వెంకటేష్, వంశీ, కార్తీక్, బీచుపల్లి ఉన్నారు.

సాగుపై ఇం'ధన' భారం

- యాంత్రీకరణకు రైతులు వెనకడుగు..
- పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు



కారుపాకులలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతులు



షేకుపల్లిలో ఒకే కాడికి రెండు అరకలు కట్టిన రైతులు

ఎర్రవల్లిచౌరస్తా: వ్యవసాయంలో ఇప్పుడిప్పుడే పెరుగుతున్న యాంత్రీకరణపై ఇంధన భారం తీవ్ర ప్రభావం చూపుతోంది. పెరిగిన విత్తన, ఎరువుల ధరలతో సతమతమవుతున్న రైతులకు పెట్రోల్, డీజిల్ ధరలు పిడుగులా పడ్డాయి. పల్లెల్లో ఒకప్పుడు ఎడ్లతో పొలం దున్నడం, అరక పట్టడంతో పాటుగా వ్యవసాయ పనులు చేసేవారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రస్తుతం యంత్రాలతో సాగు కొనసాగుతోంది. పొలాన్ని చదును చేయడం నుంచి దుక్కిదున్నే వరకు ట్రాక్టర్లనే ఉపయోగిస్తున్నారు. ఇంధన ధరలు పెరగడం, యాంత్రీకరణ వల్ల పెట్టుబడులు పెరుగుతుండడంతో రైతులు వాటిని ఉపయోగించేందుకు వెనకడుగును వేస్తున్నారు.

యాంత్రీకరణకు ప్రభుత్వ ప్రోత్సాహం..

ఒక వైపు ప్రభుత్వం వ్యవసాయ సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తుండగా, మరోవైపు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల వల్ల యంత్రాలతో సాగు భారంగా మారింది. ట్రాక్టర్లకు కిరాయి భారీగా పెరగడంతో అవస్థలు తప్పడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం రైతులతో పాటు సామాన్య, మధ్య తరగతి ప్రజలపై పడుతోంది. గత ఏడాదిలో గంటకు రూ.600–800 వరకు ఉన్న ట్రాక్టర్ కిరాయిని ఇంధన భారం వల్ల ఈ ఏడాది రూ. 1000–1200లకు పెంచేశారు. ఈ తరుణంలో యంత్రాలను పక్కనబెట్టి కాడెద్దులతో దున్నుకోవడం ఉత్తమమని చిన్న, సన్నకారు రైతులు భావిస్తున్నారు.

పశుపోషణ భారం..

ప్రస్తుతం పరిస్థితుల్లో పశుపోషణ భారంగా మారడంతో క్రమంగా రైతులు యాంత్రీకరణ వైపు మొగ్గు చూపారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా వ్యవసాయ యంత్రాలను ఇస్తుండటంతో వాటి వినియోగం అమాంతం పెరిగింది. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో వానాకాలంలో వరి, పత్తి, కంది, ఉల్లి, మిరప, మొక్కజొన్న, కూరగాయల పంటలు అధికంగా సాగుచేశారు. కరిగేట్లు చేయడం కోసం ట్రాక్టర్లను అధికంగా వాడుతున్నారు. పెరిగిన ఇంధన రేట్ల భారం చిన్న, సన్నకారు రైతులపై పడుతోంది.

సాగులో ఇబ్బందులు పడుతున్నాం..



ఒకప్పుడు ప్రతి ఇంటికీ కాడెద్దులుండేవి. ఎద్దులతో మాత్రమే వ్యవసాయ పనులు చేసేవాళ్లం. ప్రస్తుతం వ్యవసాయ పనులకు యంత్రాలు రావడంతో వాటితోనే వ్యవసాయ పనులు చేస్తున్నాం. దీంతో పెరిగిన ఇంధన ధరల కారణంగా ట్రాక్టర్ల నిర్వహణ కోసం సాగులో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇంధనం రేట్లు పెరగడంతో ట్రాక్టర్ కిరాయిలు పెంచాల్సి వచ్చింది. లేకపోతే డ్రైవర్ల జీతం, ట్రాక్టర్ కంతులు కట్టలేక మేము నష్టపోతున్నాం.

– పెద్ద వీరన్న, ట్రాక్టర్ యజమాని, సోసనూలు

వ్యవసాయం భారంగా మారింది..



పాతకాలంలో కేవలం ఎద్దులతో పొలాన్ని దున్నడం, అరక పట్టడం, ఇతర వ్యవసాయ పనులకు ఎలాంటి ఖర్చులు లేకుండా ఉండేది. ప్రస్తుత కాలంలో పశుపోషణ భారంగా మారడంతో ఎద్దులను పెంచడమే మానేశారు. యాంత్రీకరణపైనే మొగ్గు చూపుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వ్యవసాయం చేయడం భారంగా మారింది.

– గుమ్మడం లక్ష్మన్న, రైతు, బి. వీరాపురం

ప్రతిఒక్కరు హిందీ నేర్చుకోవాలి



రామాపురంలో హిందీ పండిట్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



మానవపాడులో..

శాంతినగర్: హిందీ భాషను ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు జీవన్‌కుమార్ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జాతీయ హిందీ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ 1949 సెప్టెంబర్ 14న భారత రాజ్యాంగంలోని 351వ అధికరణలో ఎనిమిదో షెడ్యూల్‌లో హిందీ భాషను అధికార భాషగా చేర్చినట్లు తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులందరు హిందీ భాషను తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హిందీ పండిట్ వసంతను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి, మధు, శ్రీను, ధనలక్ష్మి, హరిప్రసాద్, లక్ష్మి పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం హిందీదివాస్ కార్యక్రమాన్ని ఎస్‌ఓ అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు వేషధారణలో హాజరయ్యారు. హిందీభాష ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయునులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏర్పాటుకు సర్వే



అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురంలో ఎస్సీ, బీసీ కాలనీలకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసేందుకు విద్యుత్ ఎస్ఈ భాస్కర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ ఏఈ బాలస్వామి గురువారం సర్వే నిర్వహించారు. ఎక్లాస్‌పురంలో బీసీ, ఎస్సీ కాలనీలకు విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు టెండర్ ఏర్పాటు చేస్తామని ఇన్‌చార్జ్ ఏఈ తెలిపారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు మల్లికార్జున్, లక్ష్మన్న, మహేంద్ర, నాగేష్, గోపాల్, బుడ్డన్న, ఖాజా, బాలు, శ్యామ్, అనిల్ ఉన్నారు.

నేడు కాన్ఫరెన్స్

గద్వాల అర్బన్: మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు సమీక్షా నిర్వహించనున్నట్లు మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ షఫీ ఉల్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షరీఫ్ మజ్లీస్, మిలాద్ మహిఫిల్, జులుస్ తదితర కార్యక్రమాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని ఈద్ మిలాదున్ నబీ విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల దీక్ష



నిరసన దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గట్టు: ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం మండల కేంద్రంలో నిరసన దీక్ష చేపట్టారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ విజయ్, మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న, బల్గెర మాజీ సర్పంచ్ సామేలు, సీనియర్ నాయకులు ఇమ్మానియేలు, బల్గెర ముక్కెరన్న, తిమ్మన్న, అయిజ ఆంజనేయులు, నాగరాజు, జయరాజు, శ్రీను, నర్సింహులు, రాజు, ఏలియా పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో అమావాస్య పూజలు



బూడిదపాడులో..



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభు లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తులు అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవిఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టుతిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. గద్వాల పట్టణంలోని కాకతీయ టెక్నోస్కూల్ యజమాన్యం ఆదిశిలా క్షేత్రంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు అరవిందరావు, ఈఓ సత్యచ్చంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్, అర్చకులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో హరికథ...

వేంకటేశ్వరస్వామి జీవితచరిత్రను ఆంజనేయులు హరికథ రూపంలో భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, నాగరాజుశర్మ, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని గండి ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకం చేసి, పూలమాలలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మాచర్లలో శ్రీచెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉండవెల్లి: మండలంలోని డీ బూడిదపాడు శివారులోని ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వర్షాల కోసం ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణానది నదుల నుంచి నీటిని తీసుకొచ్చి ఆలయాల్లో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు.



హరికథను చెబుతున్న ఆంజనేయులు

ఎమ్మెల్యే దంపతుల పూజలు

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బండ్ల జ్యోతి దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, బీఆర్‌ఎస్ నాయకులు భగీరథ వంశీ, రామ్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



గట్టులో భక్తులకు అన్నదానం

కృష్ణుడి శోభాయాత్ర



తక్కశిలలో పల్లకీసేవలో బీఎస్పీ నాయకులు

ఉండవెల్లి: కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా కృష్ణుడి విగ్రహాన్ని గురువారం ప్రబోధ సేవాసమితి, ఇందు జ్ఞానవేదిక తక్కశిల శాఖ ఆధ్వర్యంలో పల్లకీలో ఊరేగించారు. ఉండవెల్లి, తక్కశిల గ్రామాల్లో భక్తులు భక్తి గీతాలతో నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి, ఇందు జ్ఞాన వేదిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పల్లకీసేవలో బీఎస్పీ నాయకులు..

తక్కశిలలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు కృష్ణుని విగ్రహాన్ని పల్లకీసేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభుదాసు, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలీసుల సూచనలు పాటించాలి



గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న సీఐ శివశంకర్‌గౌడ్

శాంతినగర్: వినాయక చవితి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసు వారి సూచనలు తప్పక పాటించాలని సీఐ శివశంకర్‌గౌడ్, ఎస్ఐ నరేష్‌లు నిర్వాహకులకు సూచించారు. వడ్డేపల్లి పట్టణం, మండలంలోని ఆయా గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులతో పీస్ కమిటీ సమావేశం శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించారు. పోలీసుల సూచనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

మండపానికి అనుమతి తప్పనిసరి..

కేటీదొడ్డి: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ఆయా వివరాలు తెలుపుతూ మీ సేవ సెంటర్‌లో దరఖాస్తు చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో పత్రాలు సమర్పిస్తే అనుమతులు వస్తాయని తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: కోదండాపురం పీఎస్ పరిధిలోని గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్ నుంచి అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ కృష్ణదేవ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, నిమజ్జనం శాంతియుతంగా చేసుకోవాలని పేర్కొన్నారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగుల నిరసన



దీక్ష శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

గద్వాల: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీక్షలకు వివిధ సంఘాల నాయకులు వేర్వేరుగా మద్దతు తెలిపారు. 11వ రోజు సమ్మెలో కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్‌ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు చేతబట్టి దీక్షలో కూర్చున్నారు. దీక్ష శిబిరంలోని ఉద్యోగులు తమ బ్యాగులు, గొడుగులు, బైక్‌లపై డిమాండ్లను రాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్, జనార్దన్, ఖాజా, సమి, శ్యామ్, శ్రీనివాసులు, శేషన్న, రామంజనేయులు, యువరాజు, నర్సింహ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

గద్వాల అర్బన్: పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండలక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని గురువారం జిల్లా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ కోట నర్సింహులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత కొన్నేండ్లుగా ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమాన్ని పద్మశాలీ చేనేత కార్మికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడం రామకృష్ణ, శ్రీమన్నారాయణ, నాగరాజు, శంకర్, రామన్న, పాండు ఉన్నారు.

దీక్షను భగ్నం చేయడం శోచనీయం



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్

అయిజ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నిరుద్యోగ యువత పక్షాన చేపట్టిన 24 గంటల ఉపవాస దీక్షను భగ్నం చేయడం శోచనీయమని బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులకు అన్యాయం జరిగితే వారి తరఫున బీజేపీ నాయకులు పోరాడుతారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ ప్రతాప్‌గౌడ్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, పట్టణ కన్వీనర్ కృష్ణ, మండల ఉపాధ్యక్షుడు భీమిరెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ శశిధర్, మండల కార్యవర్గ సభ్యులు భీమన్న పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు



మల్దకల్‌లో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వరూపరాణి



గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసిన డాక్టర్ ప్రసూనరాణి

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ ప్రసూనరాణి వైద్యపరీక్షలు చేశారు. సమతుల్య ఆహారం వల్ల లాభాలు వివరించారు. న్యూట్రీషన్ కిట్లపై గర్భిణులకు అవగాహన కల్పించారు. గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లను డాక్టర్ ప్రసూనరాణి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్ వైద్య సిబ్బంది ఉన్నారు. మండలంలోని సుల్తానాపూర్ ఆరోగ్య ఉప కేంద్రం నుంచి గర్భిణులను క్యాతూర్ పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించి తిరిగి వారి గ్రామానికి తరలించారు.

మల్దకల్: గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు డాక్టర్ స్వరూపరాణి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆగస్టు మాసంలో 18 ప్రసవాలు జరిగాయని, 14 రోజుల్లో 13 సాధారణ ప్రసవాలు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సత్యమ్మ, శ్రీధర్, వెంకటస్వామి, మునెమ్మ, పుష్పలేఖ, మరియమ్మ పాల్గొన్నారు.